క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



మోనాచారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

బొంరాస్‌పేట: మండల పరిధి తుంకిమెట్లకు చెందిన తెలంగాణ ఉద్యకారుడు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు మోనాచారిని బుధవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పరామర్శిం చారు. అనారోగ్యంతో ఇటీవల చికిత్స పొంది, ఇంటివద్దే ఉంటున్న ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తనవం తు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు శేరినారాయ ణరెడ్డి, దేశ్యానాయక్, తిరుపతయ్య ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయంలో బుధవారం మాస శివరాత్రిని పుర స్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ భజన మండలి భక్తుల ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి లింగా ష్టక పారాయణం, 12.30గంటలకు శివలింగా నికి పంచామృతంతో అభిషేకం, శివ అష్టోత్తర శతనామావళి, బిల్వాష్టకం, ధూపదీప నైవేద్యా లను సమర్పించారు. మహా మంగళహారతులు పడుతూ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

బొంరాస్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పలు వురు కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆ పార్టీ దుద్యాల మండలం అధ్యక్షుడు శేఖరయ్య తెలిపారు. బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి సమక్షంలో గిరిజనులు కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీలో చేరినవారిలో రోటిబండ తండా శ్రీనునాయక్, లగచర్ల తండా లాల్యానా యక్, గడ్డమీది తండా మోహన్, నీలేశ్, ఈదులకుంట తండా రామునాయక్, శివ్యానా యక్ తదితరులు ఉన్నారని చెప్పారు. ఇందులో గౌరారం మాజీ సర్పంచ్ వెంకట య్యగౌడ్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు అన్ని పథకాలు వర్తింపజేయాలి

వికారాబాద్ అర్బన్: ఎలాంటి షరతులు లేకుం డా నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్లు ఇవ్వాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర భూగర్భ వనరుల శాఖ మంత్రి మహేందర్ రెడ్డి, విక లాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర చైర్మన్ వాసుదేవ రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

హైహై వినాయక



వివిధ రూపాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

- సమీపిస్తున్న చవితి నవరాత్రోత్సవాలు
- జోరందుకున్న విగ్రహాల విక్రయాలు
- మట్టి ప్రతిమలకు మంచి డిమాండ్
- పెరిగిన కూలీ, సరుకుల ధరలు
- విగ్రహాల రేట్లు పెంచామన్న వ్యాపారులు

మరో నాలుగు రోజుల్లో వినాయక చవిత ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా భక్తుల అభిరుచి మేరకు కళాకారులు ఆకర్షణీయమైన గణేశ్ ప్రతిమలకు రూపం పోస్తుండగా.. విగ్రహాల క్రయవిక్రయాలు, స్వామివారి ప్రతిష్ఠతకు వీధివీధినా మండపాల ఏర్పాటు ఊపందుకుంది. ఈ సందర్భంగా కొన్ని స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ప్రభుత్వం పర్యావరణ రహిత విగ్రహాలను నెలకొల్పే విధంగా అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేశారు.

వికారాబాద్ అర్బన్: ఈ నెల 18 నుంచి చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యం లో గణపతుల విగ్రహాల క్రయవిక్రయాలు ఊపం దుకున్నాయి. మట్టి, రంగులరంగు విగ్రహాలను వ్యాపారులు 5 అడుగుల నుంచి 15 అడుగుల వరకు తయారు చేస్తుండగా.. కొందరు ఆర్డర్లు ఇచ్చి భారీ ప్రతిమలను తయారు చేయించుకుం టున్నారు. ఎత్తును బట్టి ఒక్కో విగ్రహం ధర రూ. 5వేల నుంచి 50వేలతో పాటు ఆపై కూడా పలుకు తోంది. కరోనా సమయంలో రెండేళ్లుగా వ్యాపారం సాగలేదని, గత ఏడాది నుంచే కొంత ఆశాజనకంగా ఉందని, ఈ సారైనా అన్ని విఘ్నాలను తొలగించి వ్యాపారం లాభాల్లో సాగాలని తయారీ దారులు కోరుకోగా.. అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించు గణపయ్య అంటూ భక్తులు కోరుకుం టున్నారు.

పెరిగిన పెట్టుబడి

విగ్రహాల తయారీకి పెట్టుబడి రెండింతలు పెరిగి నట్లు తయారీ దారులు చెబుతున్నారు. గతంలో 25 కేజీల మట్టి రూ.180కి వచ్చేదని, ఇప్పుడు రూ.350కి పెరిగిందని, విగ్రహాలను తయారు చేసే కార్మికులు కూడా కూలీ రేట్లను పెంచారని వ్యాపారులు చెప్పారు. కూలీలను రాజస్థాన్ నుంచి తీసుకురావడం, రంగుల ధరలు పెరగడంతో ఖర్చు భాగా పెరిగిందని వాపోతున్నారు.

మట్టి విగ్రహాలకు డిమాండ్

మట్టి వినాయక విగ్రహాలను డిమాండ్ భాగా పెరి గింది. బీసీ సంక్షేమ శాఖ ద్వారా పలువురుకి విగ్రహాల తయారీపై గతంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారు చాలామంది చిన్నచిన్న విగ్రహాలను తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. మట్టి విగ్రహాలను ప్రతిష్ఠిస్తే పర్యావరణాన్ని కాపాడ టంతో పాటు, కుల వృత్తులను ప్రోత్సహించినట్లు అవుతుందని అధికారులు అవగాహన కార్య క్రమాలు చేపట్టారు.

రెండు నెలలుగా పనిచేస్తున్నా



వికారాబాద్‌లో గత రెండు నెలలుగా విగ్రహాలకు రంగులు వేస్తున్నాం. కొం దరు డిజైన్‌ను బట్టి డబ్బులు తీసుకుంటారు. మరి కొందరు రోజు కూలీ తీసుకుంటారు. మాకు ఈ పనితప్ప మరేపని రాదు. రోజుకు రూ.1000 నుంచి రూ.1500 తీసు కుంటాం. గత ఏడాది కంటే ఈ సారి పని ఎక్కువ గానే దొరికింది.

–నారాయణ్, కార్మికుడు (రాజస్థాన్)

ఆకాశన్నంటిన ముడి సరుకుల ధరలు



విగ్రహాన్ని తయారు చేసే మట్టి, రంగుల ధరలు భాగా పెరిగాయి. దాంతో విగ్రహాల ధరలను పెంచాల్సి వచ్చింది. వాటిని తయారు చేయడం కేవలం రాజస్థాన్ వాళ్లకే వస్తుంది. తయారైన విగ్ర హాలకు మేము రంగులు మాత్రమే వేస్తాం. రాజ స్థాన్ కార్మికులు రోజు కూలీ రూ.1500 నుంచి రూ.2000 వరకు తీసుకుంటున్నారు. లాభాలు పెద్దగా లేకపోయినా వృత్తిని నమ్ముకుని ఉన్నందున చేయక తప్పదు.

– రాంబాబు, విగ్రహాల వ్యాపారి, వికారాబాద్

అనుమతులు తప్పనిసరి

డీజేలకు అనుమతి లేదు: సీఐ రాంబాబు

పెద్దేముల్: చవితి నవరాత్రోత్సవాలు ప్రశాంతం గా జరుపుకోవాలని తాండూరు రూరల్ సీఐ రాం బాబు చెప్పారు. బుధవారం మండల కేంద్రం లోని రైతు వేదికలో ఎస్ఐ కాశీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకు అతీతంగా, సోదరభావంతో పండుగను చేసుకోవాలని సూచించారు. విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాటు చేసే మండపాలకు, మైకులకు అనుమతి తప్పనిసరి అని, డీజేలకు పర్మిషన్ లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో పోలీ సులకు సహకరించాలని, నిబంధనలు అతి క్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి విద్యుత్ సమస్య రాకుండా చూస్తామని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, మారేపల్లితండా, పాషాపూర్, ఖాణాపూర్ గ్రామాల సర్పంచ్‌లు పాండునాయక్, భరత్, నర్సింహులు, ఏఎస్ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరం

- రాజకీయ పార్టీలు సహకరించాలి
- ఆర్డీఓ శ్రీనివాస్‌రావు
- ఇంటింటికీ తిరగని బీఎల్‌ఓలు: నాయకులు

తాండూరు రూరల్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు ముమ్మరం చేసిందని, అందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు కోరారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో నేతలతో ఆయన మాట్లాడారు. తాం డూరు నియోజకవర్గంలో మొత్తం 2,24,784 ఓట్లు ఉన్నాయని, ఇందులో పురుషులు 1,09,957, మహి ళలు 1,14,818 మంది ఉన్నారని ఆయన చెప్పారు. మొత్తం 266 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు.

బోగస్ ఓట్లను తొలగించాలి

కర్ణాటక నుంచి తాండూరు పట్టణంలో పెద్ద ఎత్తున బోగస్ ఓట్లు నమోదు చేసుకున్నారని, వాటిని తొల గించాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరగకుండా కౌన్సి లర్లు, రాజకీయ నాయకులతో మాట్లాడి వెళ్త న్నారని ఆరోపించారు. వారు ప్రతి ఇంటికి వెళితే బోగస్ ఓట్లతో పాటు డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను తొలగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఏఓ నజీరొద్దీన్, తహసీల్దార్లు తారాసింగ్, వెంకట్‌స్వామి, పద్మ, డీటీ విజయేంద్ర, ఆర్ఐ రాజిరెడ్డి, నాయకులు సుదర్శ న్‌గౌడ్, హబీబ్ లాల, సోమశేఖర్, బంటు వేణు, ప్రవీణ్, భద్రేశ్వర్ ఉన్నారు.



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

గుంతలమయం.. గుండెల్లో భయం

- ఎగిసిపడుతున్న దుమ్ముధూళి.. వాహనదారుల ఉక్కిరిబిక్కిరి

యాలాల: గుంతల రహదారులతో వాహనదారు లకు గుండెల్లో గుబులు పుడుతోంది. దారి పొడ వునా గోతులు, ఆపై గాలిలో లేస్తున్న దుమ్ముధూ ళితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. లక్ష్మీనారాయణ పూర్ నుంచి మండల కేంద్రానికి సుమారు 6 కిలో మీటర్ల మేర రెండు వరుసల రోడ్డును నిర్మించారు. కానీ ఈ దారిలో భారీ వాహనాల రాకపోకలు ఎక్కు వగా ఉండటంతో కొద్దికాలంలోనే అది పూర్తి దెబ్బ తిన్నది. గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారింది. మరమ్మతుల పేరిట ప్యాచ్ వర్క్ చేసినప్పటికీ.. దుమ్ములేస్తూ వెనకాల వస్తున్న వాహన దారులు ప్రమాదాల బారిన పడుతు న్నారు. బెన్నూరు సమీపంలో మోకాలి లోతు వరకు గోతులు ఏర్పడ్డాయని, వెంటనే రోడ్డుకు మర మ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బెన్నూరు సమీపంలో ధ్వంసమైన రహదారి

అప్పులు తెచ్చి అభివృద్ధి చేశాం..



నిరసన చేస్తున్న సర్పంచులు

- బిల్లులు చెల్లించని ప్రభుత్వాలు
- వచ్చిన నిధులను అడ్డుకుంటున్న అధికారులు
- సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి

దోమ: 'అప్పులు తెచ్చి పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేశాం. కానీ ఏళ్లు గడుస్తున్నా బిల్లు అం దడం లేదు' అని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి డిమాండ్ వాపోయారు. బుధ వారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట పలు గ్రామాల సర్పంచులతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలను చిన్నచూపు చూస్తున్నాయని ఆరోపించారు. గ్రామాభివృద్ధిలో సర్పంచులు తిప్పలు పడి సీసీరోడ్లు, అండర్ డ్రైనే జీలు, పల్లె ప్రకృతి వనం, క్రీడాప్రాంగణం తదితర పనులు చేస్తే.. వాటి బిల్లులను చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. సర్పంచుల పదవీ కాలం ముగియడానికి వచ్చినా ఏ గ్రామ పం చాయతీకి సక్రమంగా నిధులు రాలేదని మండిప డ్డారు. రెండేళ్ల కాలం నాటి నిధులు ప్రస్తుతం జీపీలకు వస్తే, ఆ నిధులను డ్రా చేయకూడదని, కలె క్టర్ ఆదేశాలు ఉన్నాయని మండల స్థాయి అధి కారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిం చారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పా రు. వెంటనే సంబంధిత అధికారులు తమ బిల్లు లను చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు వెనకాడబోమని స్పష్టం చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

- పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్
- ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాల అమలు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే సాధ్యమని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండలం, వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని 138 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. నిరుపేదలకు అన్ని రకాల వసతులు, సంక్షేమ పథ కాలు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కమల్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలో పలువురి చేరిక

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అభి వృద్ధి చెందిందని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. వికా రాబాద్ మండలం వీరంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, సీని యర్ నాయకులు సాయిరెడ్డి, యాదయ్య, బీజేపీ నుంచి ముత్యంరెడ్డి, మదనపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇబ్రహీం, గౌస్, చంద్రయ్య తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో అధి కార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి'

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పూడూరు మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం లబ్ధిదారులు వంద మందికి రూ.కోటి విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులకు దళితబంధుతో పాటు గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షలు అందజేస్తు న్నామని, రానివారు ఆందోళన చెందవద్దని, అర్హులకు అందేలా చర్యలు తీసుకుం టామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, వైస్ ఎంపీపీ మైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, సర్పంచ్ నవ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు సంక్షేమ పథకాలా?

- కమీషన్లు ఇచ్చిన వారికే స్కీంలు!
- అఖిలపక్ష నేతల ధర్నా

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పార్టీ పరంగా తప్పితే.. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడంలో ప్రజాప్రతినిధులు అవినీతి పాల్ప డుతున్నారని పీఎస్‌పీఎస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, కాంగ్రెస్ కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో పరిగి నియోజక వర్గ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దళితబంధు, బీసీబంధు పథకాన్ని అర్హులకు ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు కేవలం వారి అనుచరులు, కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అం దేలా చేస్తున్నారని విమర్శించారు. దళితబంధు పథ కాన్ని పొందాలంటే కమీషన్లు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. పీఎస్‌పీఎస్ సం ఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ మద్దతు తెలిపారు. ఇందులో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మండల అధ్యక్షుడు మైపాల్, కాంగ్రెస్ బ్లాక్2 అధ్యక్షుడు భరత్ కుమార్, బీజేవైఎం మం డల అధ్యక్షుడు మైపాల్, కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు నాగవర్ధన్, ఎస్సీమోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు జానకీరాం, సురేష్, బాబు, హన్మంతు, అంజి, ముకుంద, బాల కృష్ణ, భాస్కర్, రాంచందర్ పాల్గొన్నారు.



కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో నిరసన తెలుపుతున్న అఖిలపక్షం నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు

తాండూరు టౌన్: సబ్బండ వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక వ్యక్తి బీసీ సంఘం జాతీయ అధ్య క్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అని ఆ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన జన్మదినాన్ని పురస్క రించుకుని పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌లో కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఇందులో బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి అనిత, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, సోషల్ మీడియా ఇన్‌చార్జి బసవరాజ్, నాయకులు, రాము, జుంటుపల్లి వెంకట్, వెంకట్ సాయి, నరేష్, పరమేష్, మతిన్, రాజు ఉన్నారు.

◆ ప్రభుత్వ ఆసుపత్రిల్లో నాణ్యమైన వైద్యం

పరిగి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుష్మాన్‌భవ కార్యక్ర మాన్ని ప్రారంభించి మాట్లాడారు. గతం కంటే ప్రస్తుతం సర్కారు దవాఖానల్లో మెరుగైన వైద్యం తో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఎంపీపీ అరవింద్‌రావు, కౌన్సిలర్లు కృష్ణ, నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

◆ నేడు ఉపాధ్యాయులకు సన్మానం

దోమ: ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయిన టీచర్లకు గురువారం మండల కేంద్రం రైతువేదికలో మధ్యాహ్నం 2 గంటలకు సన్మానం జరుగుతుందని మండల విద్యాధికారి హరిశ్చందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి రానున్నారని తెలిపారు.

ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోండి

ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు వినియోగిం చుకోవాలని సర్పంచ్ రాజిరెడ్డి సూచించారు. దోమ మండల కేంద్రంలోని జీపీ ఆవరణలో ఆయుష్మాన్ భవ వైద్య సేవలను వైద్య సిబ్బందితో కలిసి ఆయన ప్రారంభించారు. ఇందులో ఉపసర్పంచ్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

దళితబంధు అర్హులకే ఇవ్వండి..

దళితబంధును అర్హులకే ఇచ్చేలా సంబంధిత అధి కారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ బొం పల్లి యువ నాయకులు మాల ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామంలో మొదటి విడతలో ఐదుగురికి దళితబంధును కేటా యించగా, ప్రస్తుతం రెండో విడతలో 12 మందికి కేటాయించారని తెలిపారు. ఇందులో మాల కుల స్తులకు ఒక్కరికి కూడా దళితబంధు ఇవ్వలేదని విమర్శించారు. అధికారులు పరిశీలించి అర్హులకే దళితబంధు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

◆ పాపన్న గౌడ్ ఆశయసాధనకు..



కుల్కచర్ల: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పాపన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇం దులో గౌడ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి రాములు, టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రహాస్, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు బాలముకుందం, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, చౌడాపూర్ మండల అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్, పూడురు మం డల ఇన్‌చార్జి కృష్ణయ్య, నాయకులు వెంకటయ్య, విజయ్, రఘు ఉన్నారు.

లక్ష్యం దిశగా సాగాలి

క్రీడాకారులు తమ లక్ష్యాలకు అనుగుణంగా ముం దుకు సాగాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి సూచించారు. ఈ నెల 12న బాలుర పాఠశాలలో నిర్వహించిన అండర్14,17 వాలీబాల్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూప గా బుధవారం వారిని ప్రిన్సిపాల్ సన్మానించి, అభి నందించారు. పీఈటీ కృష్ణారెడ్డి ఉన్నారు.

ఆయుష్మాన్‌లో వివరాలు..

ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ పథకంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహనలో ఆయుష్మాన్ గురించి వివరించారు. పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.5 లక్షల వరకు ప్రతి ఒక్కరూ ఉచితంగా చికిత్స పొం దే అవకాశం ఉందని తెలిపారు. ఇందులో వైద్యు రాలు మాధురి, మహేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్, వైద్య సిబ్బంది రత్నలత, మల్లేశ్, నవీన్, జవహర్, శ్రీనివాస్, ప్రశాంత్, సిరాజ్, పాతిమా, చంద్రకళ ఉన్నారు.

◆ నాయకుల సంఘీభావం

బొంరాస్‌పేట: 13 రోజులుగా కొనసాగుతున్న ఎస్ ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మెకు బుధవారం మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల న్యాయమైన కోరికలు వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం ఆర్డీఓ కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మెకు మద్దతు తెలిపిన వారిలో పీఆ ర్‌టీయూ, టీఎస్‌యూటీఎఫ్, తపస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీవీవీ నాయకులు రవీంద ర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, అనిల్‌కుమార్, వెంకటేశ్, రవీందర్, మండల ఎస్ ఎస్‌ఏ ఉద్యోగులు గౌస్, సీఆర్‌పీలు ఉన్నారు.

◆ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

వికారాబాద్ అర్బన్: అంగన్‌వాడీ టీచర్లను, హెల్ప ర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐ టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సమ్మ, భారతిలు డిమాండ్ చేశారు. అంగన్‌వా డీల సమ్మె బుధవారంతో 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

◆ ఎస్సీ,ఎస్టీ,బీసీలకు నాయకత్వం ఇవ్వాలి

కొడంగల్ రూరల్: ఏడు శాతం లేని అగ్రకులాలు ఏడు రాజకీయ పార్టీలకు నాయకత్వం వహించడం ఏమిటని, 93శాతం ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీల నాయ కత్వం ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్‌పీ) జిల్లా కన్వీనర్ రవీందర్, జిల్లా కో కన్వీనర్ వెంక ట్రాములు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధ వారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రాం తీయ, జాతీయ పార్టీల దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఇందులో డీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు నిఖిల్, దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు భీమరాజ్, గుండుమాల్ తిరుమల్, బీసీ సంఘం వింగ్ వెంకట్ మౌర్య, ప్రెసిడెంట్ భీమరాజ్, నాయకులు శ్రీకాం త్, రాజు, రవి, సాయి, రవితేజ ఉన్నారు.

◆ మండపాలకు అనుమతి తప్పనిసరి

దోమ: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించు కొని మండపాలు ఏర్పాటు చేసుకునే ఉత్సవ నిర్వా హకులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ రవిగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఉత్సవాల్లో భాగంగా నిబంధనలు పాటిం చాలని, డీజేలకు అనుమతి లేదని చెప్పారు. నిబం ధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరాదరణకు గురైన రాజభాష

- హిందీపై వివక్ష తగదు
- తెలుగుతో పాటే.. జాతీయ భావను విస్తరింపజేయాలి
- భాషాభిమానుల డిమాండ్
- నేడు హిందీ దివస్

మోమిన్‌పేట: 'స్వాతంత్ర్య సమరంలో దేశం మొత్తాన్ని ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించిం ది హిందీ భాష. జాతీయ నాయకులంతా హిందీ లోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ ప్రజలను చైతన్యవంతం చేశారు. ఇప్పటికీ దేశంలో మెజార్టీ ప్రజలు మాట్లాడేది ఈ భాషే. హిందీలో ప్రవేశముం టే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడికైనా నిర్భయంగా పర్యటించవచ్చు. అంతటి ప్రాము ఖ్యత కల్గిన హిందీని 1949, సెప్టెంబర్ 14న జాతీయ భాషగా గుర్తించారు. అప్పటి నుంచి యేటా హిందీ దివస్ జరుపుకొంటున్నారు' అని భాషా వేత్తలు అన్నారు. ఒకప్పుడు రాజభాషగా పేరొందిన హిందీ.. కాలక్రమేణా నిరాదరణకు గురైందని, ఆంగ్లం మోజులో జాతీయ భాషను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా హిందీ గొప్పతనాన్ని పాలకులు గుర్తించి, సముచిత స్థానం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ప్రాధాన్యత శూన్యం

జాతీయ వ్యవహారాల్లో హిందీని వాడుకలోకి తీసుకువస్తే దేశాభివృద్ధి సులభతరం అవుతుందని జాతిపిత మహాత్మాగాంధీ అనాడే చెప్పాడని, స్వాతంత్ర్యం అనంతరం హిందీకి అధికార భాషగా గుర్తింపునిచ్చినప్పటికీ.. పాలన వ్యవహారాలన్ని ఆంగ్లంలోనే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కోఠారి కమీషన్ సూచనల ప్రకారం ద్వితీయ భాషగా హిందీని బోధించాలని, పాఠశాలల్లో బోధి స్తున్నప్పటికీ.. జూనియర్ కళాశాల స్థాయిలో ప్రాధా న్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కేం ద్రం హిందీకి ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, రాష్ట్రాల్లో వివక్షకు గురవుతుందనే విమర్శలున్నాయి.

శిక్షణ కేంద్రాలు కనుమరుగు

హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో ఆరు ప్రచార సభ కేంద్రాలు ఉండేవి. 1960 నుంచి మోమిన్‌పేటలో కోనసాగుతుండగా, శంకర్‌పల్లి, తాండూర్, వికారాబాద్, పరిగి, కుల్కచర్లలో కేంద్రాలు ఉండేవి. వాటిని ఏడాది క్రితం రద్దు చేశారు. విద్యార్థులు హిందీ నాగరిక్ భోధ్ చదివేం దుకు అర్హులు. నాగరిక్‌భోధ్, ప్రవేశ, ప్రథమ, మధ్యమ, ఉత్తమ, విశారద, భూషణ్, విద్వాన్ వరకు హిందీ కోర్సులు వరుసగా రాసే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆ అవకాశం లేకుండా పోయిం దని భాషాభిమానులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో ఏడాదిలో రెండు సార్లు నిర్వహించే పరీక్షలను కూడా ప్రభుత్వం రద్దు చేసిందని వాపోతున్నారు.



హిందీ అక్షరమాల

వివక్ష తగదు



హిందీ పండితులు, భాషపై చిన్నచూపు తగదు. హిందీ ప్రచార అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత కల్పించాలి. అన్ని స్థాయిల్లో అమలయ్యేలా చూడాలి. ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే హిందీని ప్రవేశపెట్టాలి. దేశంలో 90శాతం ప్రజలు మాట్లాడే హిందీపై వివక్ష చూపడం సరికాదు.

– ప్రభాకర్, హిందీ పండితుడు

ప్రాముఖ్యతను తెలపాలి



హిందీ భాష ప్రాముఖ్యతను విద్యార్థి దశలోనే తెలపాలి. తెలం గాణ ఉద్యమంలో హిందీ కీలక ప్రాత పోషించింది. తెలుగుతో పాటు సమానంగా హిందీ భాషను విస్తరింపజేయాలి.

– ఎ.పద్మరావు, హిందీ ప్రచారకులు